www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025
5
అన్నమయ్య

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుర్రంకొండ

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గుర్రంకొండ మండలం తరిగొండలో రైతుల సదస్సు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తూ, దేశ ప్రజల త్యాగాలతో స్థాపించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 20న కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెకు పిలుపు నిచ్చాయని తెలిపారు. అదేరోజు దేశ వ్యాప్తంగా గ్రామీణ పేదలంతా వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, గ్రామీణ పేదల హక్కులు కాపాడుకునేందుకు జరగనున్న హర్తాల్‌ను జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయట పడేస్తానని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ మాటలు నీటి మూటలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు ఈ రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని రైతుల ఆదాయాలు పెరగకపోగా, ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. వ్యవసాయ పరిరక్షణ కోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ధాన్యం, పొగాకు, మిర్చి వంటి ఏ పంటలకూ రాష్ట్రంలో గిట్టుబాటు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం ఇంత వరకూ అమల్లోకి రాకపోవడం దుర్మార్గమని తెలిపారు. తక్షణమే ప్రతి రైతు కుటుంబంతోపాటు, కౌలు రైతులందరికీ పెట్టుబడి సాయం రూ.20 వేలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టమోటా పంటకు గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ జరగనున్న కార్మిక, కర్షక, శ్రమ జీవుల సంఘాల పిలుపు మేరకు హర్తాల్‌లో గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు, కనీస వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించిన విధంగా కనీసం రోజుకు రూ.400 వేతనం చెల్లించాలని కోరారు. దేశం ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలంటే గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగాలని, అందుకు ఉపాధి హామీ చట్టమే మేలైన మార్గమని తెలిపారు. రాష్ట్రంలో రూ.700 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు వినయం, విధేయత, క్రమశిక్షణ లను అలవర్చుకోవాలని సెంట్రల్ సిల్క్ బోర్డు మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సి.దీపా పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధానశాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులకు ఆదివారం ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ దీప మాట్లా డుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు పెద్దలపట్ల గౌరవం, సమాజంలో ఎలా మెల గాలనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన నడవడికే భవిష్యత్తును నిర్దేశిస్తుందని, విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను చక్కగా అంది పుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంతకుమారి వేసవి శిక్షణా శిబిరాన్ని చాలా చక్కగా నిర్వహిస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం ప్రముఖ మోటివేషన్ స్పీకర్ రామ్మూర్తి మాట్లాడుతూ పంచేకొద్దీ జ్ఞానం పెరుగుతుందని కావున విద్యార్థులు గ్రంథాలయాలకు విచ్చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లకు అలవాటు పడి పోతున్నారన్నారు. మొబైల్ ఫోన్స్ వడకం కంటే తరచూ గ్రంథాలయాలకు విచ్చేసి పుస్తకం పఠనాన్ని అలవర్చుకుంటే ఎంతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చునన్నారు.

దీపను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారిణి

ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా ఉచిత విజ్ఞాన తరగతులను నిర్వహిస్తూ, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సైంటిస్ట్ దీపాను గ్రంథాలయ అధికారిణి వసం తకుమారి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డెప్ప, మదన్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌ను బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా డివిఎంసి సభ్యులు వి.రాజ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం కాణిపాకం వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుని వారు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం వారు పీలేరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, ముఖ్యంగా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల స్థితిగతులపై, జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌తో చర్చించామన్నారు. ఈ రెండు జిల్లాల్లో నమోదైన 41 అట్రాసిటీ కేసుల్లో నోటీసుల విషయంలోనూ సంపూర్ణంగా చర్చించి, నిందితులను అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల విచారణలో చోటు చేసుకుంటున్న జాప్యం, బాధితులకు అందాల్సిన పరిహారం విషయంలో జరుగుతున్న లోపాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ వచ్చే నెలలో రాయలసీమ జిల్లాల్లో పర్యటించి, అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి తగిన వివరాలను అందిస్తూ, ఎస్సీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు.

మృత్యువులోనూ వీడని బంధం

- సత్యసాయి జిల్లాలో రోడ్డు ప్రమాదం
- ముగ్గురు అన్నదమ్ములు దుర్మరణం
- మదనపల్లెలో విషాదం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

వారంతా ఒకే తల్లి తల్లి రక్తం పంచుకుని పుట్టారు. ముగ్గురు అన్నదమ్ములు. మంచి చదువులు చదువుకుని ఉన్నత పదవులు అలంకరించి రిటైర్డ్ అయి విశ్రాంత జీవితం గడుపుతున్నారు. తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థితిలో నిలిపారు. ఈ ముగ్గురు అన్నదమ్ములు ఇప్పటికీ ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళ్లేవారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కేంద్రంలో తమ సమీప బంధువు వరుసకు తమ్ముడయ్యే వ్యక్తి చనిపోతే అతని అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అన్నదమ్ములు ప్రాణాలు వదిలారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..

జయచంద్ర, నాగేంద్రుడు (ఫైల్‌ఫొటోలు)

మదనపల్లె పట్టణం, స్థానిక సొసైటీ కాలనీలో నివాసం ఉంటున్న మునుస్వామి సావిత్రమ్మ దంపతులకు నాగేంద్రుడు (65) జయచంద్ర (72) చలపతి (75) ముగ్గురు శనివారం అనంతపురంలో దగ్గర బంధువు వరుసకు తమ్ముడు అయ్యే చిన్ని అనే వ్యక్తి అనారోగ్యంతోమృతి చెందాడు. ఆదివారం అతని అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ముగ్గురు అనంతపురానికి బయలు దేరారు. అంత్యక్రియలు ముగించుకుని తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని సత్యసాయి జిల్లా కదిరి సమీపంలో నల్లచెరువు మండల కేంద్రం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న నాగేంద్రుడుతోపాటు అన్నలు చలపతి, జయచంద్ర దుర్మరణం చెందారు. వారితో పాటు కారులో ప్రయాణిస్తున్న వారి దగ్గరి బంధువు వేణుగోపాల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నల్లచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాదేంద్రుడు ఇంట్లో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు

కాగా నాగేంద్రుడు మదనపల్లె బిటి కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా (హెచ్‌ఒడి)గా పనిచేస్తూ 2019లో రిటైర్డ్ అయ్యారు. ఆయనకు భార్య సౌభాగ్య, కుమారుడు బాలసుబ్రమణ్యం, కుమార్తె వంశీ ప్రియాంక ఉన్నారు. కుమారుడు కెనడాలో ఉండగా, కుమార్తె అమెరికాలో ఉన్నారు. కాగా ఆయన అన్న జయచంద్ర మదనపల్లి ప్రశాంత్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీకాళహస్తిలో 2011 ఎఎస్‌ఐగా రిటైర్డ్ అయ్యారు. ఆయన భార్య శారద ప్రస్తుతం మదనపల్లె మండలం సిటిఎం జడ్‌పి స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు కుమార్తె ఉషశ్రీ, కుమారుడు వెంకట నరేష్ ఉన్నారు. మరో అన్న చలపతి తిరుపతి ముత్యాలరెడ్డిపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆయన తిరుపతిలో ఎఎస్‌ఐగా రిటైర్డ్ అయ్యారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తె నీలిమ, కుమారులు సురేష్, ప్రశాంత్ ఉన్నారు.

హజ్‌యాత్ర పవిత్రమైంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిం మైనారిటీలకు హజ్ యాత్ర ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె పట్టణం, జామియా మసీదు నందు 56 మంది యాత్రికులు ప్రార్థనలు ముగించుకొని హజ్ యాత్రకు వెళుతున్న సందర్భంగా వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హజ్ యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకొని, సంతోషంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హజ్ యాత్రికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎపి హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారికి హజ్ కమిటీ అన్ని వసతులు కల్పిస్తోందని, వారు ఇక్కడ బయలుదేరినప్పటి నుండి తిరిగి వారి స్వస్థలాలకు చేరుకునేంతవరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో హజ్ యాత్రికుల కొరకు ఇటువంటి మెరుగైన సౌకర్యాలు కల్పిం చలేదన్నారు. హజ్ పర్యటన విజయవంతం కావాలని కోరుకున్నారు. కార్యక్ర మంలో హజ్ యాత్రికులతో పాటు ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హజ్ యాత్రికులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన మదనపల్లె వాసులు

మదనపల్లె వాసులకు 'గిన్నిస్ బుక్'లో చోటు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మ్యూజిక్ కాంపిటీషన్‌లో మదనపల్లె వాసులకు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కింది. మదనపల్లె సిఎస్ఐ జెసిఎం చర్చ్ పాస్టర్ డాక్టర్ రెవరెండ్ సునీల్ వరకుమార్, సతీమణి లూసి మేరి, సంఘ సభ్యులు కళ్యాణి, ప్రసన్న, రంజిత్ సుదీర్ విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యూజిక్ కాంపిటీషన్ పాల్గొన్నారు. 2024 డిసెంబర్ 1న జరిగిన మ్యూజిక్ కాంపిటీషన్‌లో 18 దేశాలకు చెందిన 1,090 మంది ప్రాతినిధ్యం వహించారు. ఇందులో 1,046 మంది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. లూసీ మేరీ, సంఘ సభ్యులు కళ్యాణి, ప్రసన్న, రంజిత్ సుదీర్ కూడా ఎంపిక అయ్యారు. ఈమేరకు ఈనెల 3న బెం గళూరులో పాస్టర్ అగస్టీన్ దండంగి చేతుల మీదుగా ధ్రువపత్రాన్ని అందుకున్నారు. సిఎస్ఐ జెసిఎం చర్చ్ సంఘ సభ్యులు సాధించిన ఈ రికార్డు మన సంఘానికి వచ్చిన ఘనతగా వారిని అభినందించి ప్రశంసలు అందజేశారు.

డిఎస్‌సిలో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆంధ్ర ప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కడపలో మెగా డిఎస్‌సి పరీక్షల కోసం ఆన్ లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బిసి స్టడీ సర్కిల్ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన కడప జిల్లా వాసులకు మాత్రమే బిసి, ఇడబ్ల్యుఎస్, ఇబిసి, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరిలకు చెందిన అభ్యర్థుల నుంచి మెగా డిఎస్‌సి పరీక్షల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. మెగా డిఎస్‌సి ఆన్ లైన్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుదారులు టెట్ పరీక్షలో అర్హత సాధించిన మార్కుల జాబిత, కులధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి నగరంలోని పాత రిమ్స్‌లో ఉన్న బిసి భవన్ కార్యాల యంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాల యంలో కానీ, 9849919221, 9966418572 లేదా dbcweo.ysr.22@gmail. com ద్వారా సంప్రదించాలని తెలిపారు.

అమరులైన వీర జవాన్లకు నివాళులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతదేశ శక్తి సామర్థ్యాలు ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచ దేశాలకు తెలియజేసిందని ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక జీఆర్టీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సీనియర్ సిటిజన్స్ సమావేశం జరిగింది. డాక్టర్ మహమ్మద్‌గౌస్ హాజరై వయో వృద్ధులకు వచ్చే ఆరోగ్య సమసస్యలపై అవగాహన కల్పించారు. దేశంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడులను తిప్పి కొడుతూ భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడును ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌పై పాకిస్తాన్ చేసిన ఉగ్రదాడులను తిప్పి కొట్టడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రతి పౌరుడు సమర్థించి యుద్ధసమయంలో దేశభక్తిని చాటి చెప్పారన్నారు. అమరులైన సైనికులను భారతీయులందరూ గుర్తించు కోవాలంటూ ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ మునిరత్నమయ్య, కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్ సాహెబ్, ఉపాధ్యక్షుడు జగన్ మోహన్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, నాగరాజు, పెన్షనర్స్ పార్టీ నాయకులు సి.కె.శ్రీనివాసులు, తిమ్మయ్య, ధనలక్ష్మి, సరస్వతి, విశ్రాంత ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్ రెడ్డి, రామచంద్రయ్య, కంచర్ల చింటు పాల్గొన్నారు.

వీర జవాన్లకు సంఘీభావం ప్రకటిస్తున్న సీనియర్ సిటిజన్స్

గెట్‌టు గెదర్ కార్యక్రమంలో అధ్యాపకులతో విద్యార్థులు

పూర్వ విద్యార్థులే కళాశాలకు పట్టుగొమ్మలు

ప్రజాశక్తి-రాయచోటి

పూర్వ విద్యార్థులే కళాశాలకు పట్టుగొమ్మలు అని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ రాయచోటికు చెందిన ఇఇఇ 2011-2015 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కళాశాల పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ, గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థిగా గడిపిన రోజుల జ్ఞాపకాలను పునఃస్మరించుకుంటూ, కళాశాల అభివృద్ధిలో తమ భాగస్వామ్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం నిర్మాణం మాత్రమే కాదు ఇది కళాశాల పట్ల ఉన్న ప్రేమ,విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పాఠశాల విద్యార్థుల మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరుస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కృషి కళాశాల వారసత్వాన్ని ప్రతిబింబించే చిరస్మరణీయ చిహ్నం అని ఇది ప్రస్తుతం చదువు తున్న విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది అని అన్నారు.అల్యూమిని అసోసియేషన్ ప్రతిని ధులు మాట్లాడుతూ ఇది మొదటి మెట్టు మాత్రమే భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని నమ్మకం వ్యక్తం చేశారు. కళాశాల పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ విద్యార్థి బంధానికి నిలిచే ఉత్తమ ఉదాహరణగా నిలుస్తోందిన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భవనాలకు మరమ్మతులు చేసి వాటి స్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ కలెక్టర్ కార్యాలయ భవనాలను ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూనంగా దెబ్బతిన్న పాత భవనాలను నేటి అవసరాలకు తగినట్టు ఆధునికరించామని తెలిపారు. నవీకరణ చేసిన భవనాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని అన్నారు. కార్యక్ర మంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నది యాదేవి పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెసి

మైనార్టీల సంక్షేమానికి కృషి

జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి హిదాయతుల్లా

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, వారి అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి షేక్.హిదాయతుల్లా పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మైనార్టీల స్కీములు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను మైనార్టీలు ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో మైనారిటీలకు ఇస్తున్న స్కీములు తెలపండి?

జిల్లాలో మైనార్టీలకు ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాల నిర్మాణం మరమ్మతులు, పోస్ట్, ప్రీ-మాట్రిక్ హాస్టల్స్ నిర్వహణ, పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌లు, మౌజన్లు, పేష ఇమాములు, పాస్టర్లకు హనరేరియం, (ప్రధాన మంత్రి జన వికాస్ కార్యక్రమం) కింద మల్టీ సెక్టోరల్ అభివృద్ధి పనులు, ఉర్దూ అకాడమీ ద్వారా కంప్యూటర్ ట్రైనింగ్ ప్రోగ్రాములు, సిడిఇఎం ద్వారా మైనారిటీ విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం శిక్షణలు అందిస్తున్నాం.

మైనారిటీ హాస్టల్ వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా మొత్తం హాస్టల్స్ మూడు ఉన్నాయి. పోస్ట్ మ్యాట్రిక్ హాస్టల్ - బాయ్స్ అండ్ గర్ల్స్- రాజంపేట, ప్రీ మ్యాట్రిక్ హాస్టల్ - బాయ్స్ - మదనపల్లె, ఈ హాస్టళ్లల్లో ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభు త్వానికి పంపించబడ్డాయి.

మైనారిటీ విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ఆర్‌టిఎఫ్ (ట్యూషన్ ఫీజు)రూ. 3.09 కోట్ల మేర విద్యార్థులకు విడుదల అయ్యాయి.హాస్టల్ వసతి (బాయ్స్,గర్ల్స్)ఉర్దూ అకాడమీ ద్వారా లైబ్రరీ, కంప్యూటర్ శిక్షణ కల్పిస్తున్నాం. సిడిఇఎం ఈఎమ్ ద్వారా మైనారిటీ విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం శిక్షణలు ఇప్పిస్తున్నాం.

మైనారిటీలకు రుణాలు ఏమైనా ఇస్తున్నారు?

జిల్లాలో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ యువతకు 50 శాతం వరకు సబ్సిడీతో రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభించాం. దీనికి అర్హతలు 21-55 సంవత్సరాల వయసు, ఆదాయం గ్రామీణ ప్రాంతం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతం రూ.2 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తులు కోసం https:// apob mms.apcfss.in యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కమ్యూనిటీ సంక్షేమ పథకాలు వివరాలు?

ఇమాములు, మౌజంలకు గౌరవ వేతనం అందిస్తున్నాం. ఈ పథకం కింద రాష్ట్రంలోని రూ. 5 వేలు ఆదాయ లేని మసీదులకు ప్రతి నెలా ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.15 వేలు హానరేరియం అందజేస్తున్నాం. జిల్లాలోని 263 గుర్తింపు పొందిన మసీదుల్లో మౌజన్లు, పీర్ ఇమామ్‌లు హానరేరియం పొందుతున్నారు. ఆదాయ లేని చర్చికి పతి నెలా రూ.5 వేలు పాస్టర్లులకు గౌరవ వేతనం అందించబడుతుంది. అన్నమయ్య జిల్లాలో మొత్తం 99 పాస్టర్లు ఈ పాస్టర్లు గౌరవ వేతనం పొందుతున్నారు.

కేంద్రం ప్రభుత్వం ఎలాంటి స్కీములు మంజూరు చేస్తుంది?

ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యాలయం, జూనియర్ కాలేజీ, బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. పోస్టులు, recurring/ non- recurring ఖర్చులకు అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం.

మైనారిటీ స్థలాల అక్రమాల వివరాలు తెలపండి?

జిల్లాలో 17 ఎకరాలు వక్ఫ్ భూములు ఆక్రమణ నుండి తిరిగి పొందాం. మరిన్ని స్థలాలకు సంబంధించి నోటీసులు జారీ చేశాం.

ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

వక్ఫ్ భూములపై అక్రమ కబ్జా కేసులపై నోటీసులు జారీ చేశాం.జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షణ చేస్తోంది.

మైనారిటీశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న షాదీఖానాలు ఎన్ని? వాటి వివరాలు తెలపండి?

జిల్లాలో 10 ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాలున్నాయి. మదన పల్లెలో నిర్మాణంలో ఉన్న షాది మహల్ కోసం రూ. 70 లక్షల ప్రతిపాదనలు పంపాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

కొత్త జిల్లాల ఏర్పాటు అయిన తర్వాత ఇంకా పోస్టులు మంజూరు చేయలేదు. పూర్వపు జిల్లా సిబ్బంది బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాకు సిబ్బంది మంజూరు అవసరం ఉంది.

మైనార్టీలకు సలహాలు,సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

మైనార్టీ విద్యార్థులు విద్యను ప్రాధాన్యంగా తీసుకోవాలి. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి పట్ల ఆసక్తి చూపాలి. ప్రభుత్వ స్కీములను పూర్తిగా వినియోగించుకోవాలి. మైనారిటీ కమ్యూనిటీలకు సంబంధించి అభ్యర్థనలు, ఫిర్యాదులు కోసం జిల్లా మైనారిటీ శాఖను సంప్రదించాలి.

అన్నదానం చేస్తున్న కాకతీయ కమ్మ సమాజం ప్రతినిధులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటకు చెందిన కాకతీయ కమ్మ సేవా సమాజం అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భక్తులకు విశేష అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం అన్నదానంతో పాటు వేలాదిగా విచ్చేసిన ప్రజలకు లడ్డూలు, అరటి పండ్లు, మంచినీరు అందించారు. అన్నదాన కార్యక్రమాన్ని సాధారణ భక్తులతో పాటు పెంచలకోనలో పనిచేసే ఉద్యోగులు, పోలీసు,ు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఉద్యోగులు కూడా వినియోగించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. పెంచలకోనలో ఈ కార్యక్రమాన్ని గత కొన్ని కొన్నేళ్లుగా నిర్వహించడం జరుగుతోందని, అన్నదానం చేయడం గొప్ప భాగ్యమని అన్నారు. కార్యక్రమంలో కాకతీయ కమ్మ సమాజ సేవా సమాజం ఉపాధ్యక్షులు కొల్లపనేని బుజ్జిబాబు, పువ్వాడి రామసుబ్బయ్యనాయుడు, సింగన నారాయణనాయుడు, సుధాకర్‌నాయుడు, తాళ్లూరి వెంకటేశ్వర్లునాయుడు, శివాజీ నాయుడు, కిలారు శ్రీనివాసులు నాయుడు, సింగన శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ జాతర

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో వెలిసిన చిన్న గంగమ్మ జాతర ఆదివారం మైల తిరుణాలతో ముగిసింది. జాతరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయాయి. కుంకుమ, చాందిని బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాయి. ఆలయ ధర్మకర్తలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు. అనంతరం వచ్చిన భక్తు లకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. **కలికిరి:** మండలంలోని పత్తేగడ గ్రామపంచాయతీ తెల్లగుట్టపల్లిలోని తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం పౌర్ణమి వేడుకల్లో భాగంగా అమ్మవారి జాతర వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుదరంగా విద్యుధ్ధీ పాలతో అలకరించారు. ముందుగా ఆలయ ధర్మకర్తలు మంగమ్మ, అగస్తీశ్వర్ చేతుల మీదుగా అర్చనలు అభిషేకాలు నిర్వహించి విశేషపూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఆలయ పూజారి సుబ్రమణ్యం, అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మ..

పీలేరు : మండలంలోని వేపులబైలు పంచాయతీ. జంగంపల్లి వద్ద వెలసిన శ్రీఅంకాళమ్మ ఆలయంలో సోమవారం నుంచి రెండు రోజులపాటు జరగనున్న జాతరకు అంతా సిద్ధం చేసినట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, హెూమాలు, అభిషేకం, భక్తులకు తీర్చి ప్రసాదాల వినియోగం, రాత్రికి చాందినీ బండ్లు, చెక్కభజన, కోలాటాలు, మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయ న్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి బోనాలు, ముక్కుపుడకల అలంకరణ, వంట కార్యక్రమాలుంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోలీసుల తీరు అమానుషం

ప్రజాశక్తి - కడప

మాజీ మంత్రి విడుదల రజనీపై పోలీసుల తీరు ఉమానుషం అని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు అధ్యక్షులు తెలుగు పులి వెంకట సుబ్బమ్మ అన్నారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిసి కులానికి చెందిన మహిళా నాయకులు విడుదల రజనీపై పోలీసుల వ్యవహారం దారుణం అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయి అన్నారు .మహిళలకు విలువ లేకుండా పోలీసులు ప్రవర్తిస్తుంది అని ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో మహిళా ఎంపిటిసిని అక్రమంగా అరెస్ట్ చేశారని చెప్పారు. ప్రభుత్వ తీరు మారకుంటే మహిళలు తగిన గుణపాఠం చెబుతారు అని హెచ్చరించారు. సమావేశంలో వైసిపి మహిళా నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి - కడప : తల్లిదండ్రులను ప్రేమించడం పిల్లలకు నేర్పించాలని పాస్టర్ పి. మహేష్ అన్నారు. కడప నగరం 48వ డివిజన్ కృపా కాలనీలో ఆదివారం న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో మదర్స్‌డేను పురస్కరించుకొని స్వీట్లు పంచుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా డేవిడ్ థెయొఫిలాస్ హాజరై మాట్లాడుతూ పిల్లలను ఆధ్యా త్మికంగా పెంపొం దించడంలో తల్లి బాధ్యత ప్రముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, ఏ.అగస్టిన్, రోజా, లీలావతి, దూపం మహేష్, సుగుణమ్మ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాలల పున:వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం పట్ల పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం కడప డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టామని, జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతివారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించడం లేదన్నారు. ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని తెలిపారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతుల విలీనం, జిఒ 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందన్నారు. ఫలితంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలి పోయారని వివరించారు. జిఒ 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరమన్నారు. కొత్తగా 779 హైస్కూళ్లు అప్‌గ్రేడ్ చేయడం, 9,652 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడం హర్షణీయమే.. కానీ హైస్కూళ్లల్లో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ సెక్షన్ కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లిషు సర్‌ప్లస్ అవుతున్నాయన్నారు. ఉన్నత పాఠశాలల్లో 46మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ కడప జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, కార్యవర్గ సభ్యులు గోపీనాథ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బిఇడి కళాశాలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బి ఇడి కళాశాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బి ఇడి కళాశాలలు యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. సిబ్బంది, కనీసం ల్యాబ్‌లు కూడా లేవన్నారు. బయటి రాష్ట్రాల నుండి అడ్మిషన్లు నిర్వహించుకుంటూ రూ.వేలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. చాలా వాటికి కనీసం తలుపులు తీసిన దాఖలాలు కూడా లేవన్నారు. యాజమాన్యాలు ఎడ్ సెట్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే పరీక్ష నిర్వహణ పూర్తి కాకముందే ఇప్పటినుండే అక్రమంగా అడ్మిషన్లు బయటి రాష్ట్రాల నుండి తెచ్చుకుంటున్నారని తెలిపారు. యూనివర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆయా కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి :ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ జాగ్రత్త వహించాలని స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రికార్డులు లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గతంలో వాహనాలను తనిఖీ చేసేటప్పుడు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు వంటివి దగ్గర లేకుంటే తక్కువ మొత్తంలో జరిమానా విధించడం జరుగుతుండేదని అన్నారు. కొత్తగా వచ్చిన మోటర్ వాహన చట్టం ప్రకారం జరిమానాలు భారీగా పెరిగాయని, ఒక్కొక్కసారి లైసెన్సు రద్దుతో పాటు జైలు శిక్షలు కూడా పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేకుంటే వెయ్యి రూపాయలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5 వేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే పదివేల రూపాయలు జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే రూ.25వేలు జరిమానాతో పాటు వారి తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకో రాదని, యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రతిరోజూ

వాహనాలకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. స్థానికుల సైతం రోడ్డుపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. కొత్త మోటారు వాహన చట్టంపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని, కొత్త ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రతా చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి ఇక భారీ జరిమానాలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

తలసేమియా చిన్నారులకు రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తలసేమియా చిన్నారుల పాలిట రక్షకులు రక్తదాతలని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిఖ్ అన్నారు. తలసేమియా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మదనపల్లి మెట్రో కాంప్లెక్స్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అబూబకర్ సిద్ధిక్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో ఎంతో మంది చిన్నారులు రక్తం అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అలాంటి చిన్నారుల కోసం ఈ రక్తదానం శిబిరం నిర్వహించామని ఆపరేషన్ సింధూరులో అమరులైన దేశ సైనికులకు రక్తదాన శిబిరంతో సంఘీభావం తెలిపినట్లు పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా వేలాదిమందిచే రక్తదానం చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత మంది చే రక్తదానం ఆవశ్యకత తెలిసేలా తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ బాలచంద్ర నాయుడు, రక్తనిధి సిబ్బంది కృష్ణ, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పురుషోత్తం, దినకర్, కిరణ్, చైతు, సాంబ, రెడ్డి, చరణ్, దేవ రష్మిక, సమీర్, పవన్ పాల్గొన్నారు.

వెల్ విషర్స్ ఆధ్వర్యంలో..

మదనపల్లె : మదర్స్‌డే సందర్భంగా వెల్ విషర్స్, ఫ్రెండ్స్2 సపోర్ట్ సంస్థల ఆధ్వర్యంలో మదనపల్లె ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 38 మంది సభ్యులు రక్తదానం చేశారని వెల్ విషర్స్ సంస్థ నిర్వాహకులు గిరీష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ రమాదేవి పాల్గొన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడటం అభినందనీయమని అన్నారు. రక్త కొరతతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని యువత ముందుకొచ్చి రక్తం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో రక్తదానం చేయాలనుకున్నా లేదా రక్తం అవసరమైనా దేశవ్యాప్తంగా లక్షలాది మంది రక్తదాతల వివరాలు కలిగిన వెబ్‌సైట్, మోబైల్ యాప్ friends2supportలో పేర్లు నమోదు చేయాలని కోరారు. స్వచ్ఛంద రక్తదాతలందరికీ బహుమతులు అందించారు. వెల్ విషర్స్ నిర్వాహకులు గిరీష్ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం లో విజయ, నవ్య, రెడ్డి శేషు, భాను ప్రకాష్, లక్ష్మీపతి, మురళీకృష్ణ, వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దాతలు

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని మర్రిచెట్టు శ్రీశ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం ఆదివారం భక్తుల కోలాహలం నడుమ శ్రీదేవి భూదేవి సమేతంగా వైభంగా నిర్వహించినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. దండేవాండ్లపల్లె నుంచి ఉత్సవ విగ్రహాలను బాణాసంచా పేలుస్తూ బ్యాండ్ మేళ తాళాలతో మార్ల రవీంద్రారెడ్డి, దండే వెంకటరమణ కుటుంబ సభ్యులు మర్రిచెట్టు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంకి చేర్చారు. వేద పండితులు వెంకటనారాయణ శాస్త్రి బృందం గణపతి పూజ , స్వస్తి వాచనం, స్వామీ వారికి అభిషేకం,అలంకరణ, నవగ్రహ హెూమం, స్వామీ వారి మూలమంత్ర హెూమం లతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి చెంచులక్ష్మి వారి కళ్యాణోత్సవాన్ని వేద పండితులు నిర్వహించారు. తాళిబొట్టు, పట్టు వస్త్రాలతో అలంకరించి సాంప్రదాయపద్ధంగా కల్యాణంను నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమానికి ఏర్పాటు చేసిన రథంకు సహకరించిన దాతలను కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. చెంచు నాటకం కథ దాతలు సహకారంతో కమిటీ సభ్యులు నిర్వహించినారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు వై.ప్రసాద్ యాదవ్, శివశంకర్‌రెడ్డి, రామచంద్ర యాదవ్, నాగేంద్రబాబు, బాలసుబ్రమణ్యం, శివయ్య, దేవేంద్రారెడ్డి, సుధీర్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, దండే వీరయ్య, పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు లక్ష్మి నరసింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్దివీడు సమీపంలో మాండవ్యనది ఒడ్డున వెలసిన లక్ష్మీ నరసింహస్వామి వారికి ఆదివారం నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు అలంకరణ చేసి భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించిన అనంతరం భక్తులు అందరికీ ఆలయ ప్రాంగణంలో భోజన వసతి కల్పించారు.వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

తాగునీటి బోరును పరిశీలిస్తున్న అలివేలమ్మ

ప్రజాశక్తి-కలకడ

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చొరవతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని రాతిగుంటపల్లి సర్పంచ్ అలివేలమ్మ పేర్కొన్నారు. మండలంలోని రాతికుంటపల్లి పంచాయతీలో తాగునీటి సమస్య ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ గ్రామస్తులు తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే చొరవ తీసుకొని శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించే దశలో రెండు బోర్లను వేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు.రెండు బోర్లను ఎగువబట్టవారిపల్లెలో ఒకటి, ముత్యాలమ్మ గుడి వద్ద వేయించినట్లు తెలిపారు. ఈ రెండు బోర్లులలో నీరు పుష్కలంగా పడిందని, గ్రామానికి నీటి ఎద్దడి సమస్య లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, ఆనంద నాయుడు, వసంతనాయుడు, పివి.నాయుడు, జనార్దన్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బి.కొత్తకోట : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పెద్దతిప్ప సముద్రం, టి.సదుంబస్టాండ్ వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక కీళ్ల, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి నట్లు తెలిపారు. ఇసిజి, ఎకో,ముందస్తుగా కేన్సర్‌ను గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయడం జరిగిందన్నారు. సుమారు 100 మంది రోగులు పరీక్షలు చేసుకోగా ఇందులో 15 మందిని కంటి ఆపరేషన్, కేన్సర్ 2, ఎముకలు 2 శస్త్రచికిత్సలకు ఎంపిక చేయగా ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు భోజనవసతి, మైక్ సెట్ సదుపాయం సదుం సర్పంచ్ ముని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నారాయణమ్మ, ఆశా కార్యకర్తలు టి.భ్రమరాంబ, సి.సుగుణ, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు అనిల్, ఆదర్శ, శ్రావ్య, నాని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మా వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి-రాయచోటి : నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, టిడిపి యువ నాయకులు నిచ్చల్ నాగిరెడ్డితో కలిసి పట్టణంలో ఎస్ఎన్.కాలనీలో మా వెల్ఫేర్ సొసైటీ వారి అద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో శుభప్రదమన్నారు. గతంలో రాయచోటి ప్రాంతంలో మా వెల్ఫేర్ సొసైటీ వారు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని రాబోయే రోజులలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి ప్రజలకు చేరువ కావాలన్నారు. కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మోడల్ ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మోడల్ ఇఎపి సెట్‌కు అపూర్వ స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఇఎపిసెట్-2025 ఆన్‌లైన్ పరీక్షకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు, అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్‌లో మోడల్ ఇఎపిసెట్ ప్రాక్టీస్ పరీక్ష-2025ను విద్యార్థులకు ఆదివారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. పరీక్ష విధానం ఏవిధంగా ఉంటుందో, సరైన సమయంలో విద్యార్థులు పరీక్షను ఎలా నిర్దేశించగలరో తెలియుటకు ఈ పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. మిట్స్ కళాశాల యాజమాన్యం ఉచితంగా ఉదయం10 నుంచి ఒంటి గంట వరకు, రెండవ విడత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అత్యాధునిక టెక్నాలజీ లతో గల కంప్యూటర్లలో పరీక్షను నిర్వహించామని తెలిపారు. ఉదయం 1139 మంది, మధ్యాహ్నం 490 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. రాయచోటి, పీలేరు, కదిరి, పుంగనూరు, పలమనేరు, బి.కొత్తకోట, మదనపల్లె నుంచి 1629 మంది విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఇందులో ప్రతిభ కనపరిచిన పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామని ఆయన అన్నారు. పరీక్షకు సంబంధించిన ఫలితాలను వారం రోజులలో కళాశాల వెబ్‌సైట్ www.mits.ac.in లో పొందుపరుస్తామని తెలిపారు.

తల్లులకు పుష్పాలు అందిస్తున్న పిల్లలు

బి.కొత్తకోట : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఆదివారం మాతృభాష దినోత్సవాన్ని అమ్మకు వందనం కార్యక్రమాన్ని ప్రాజెక్టు పరిధిలోని ఏడు అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించారు. సిడిపిఒ భాగ్యమ్మ హాజరై పిల్లలకు తల్లుల ద్వారా ఆశీర్వాదం అందించడం, పిల్లల పెంపకం గురించి తల్లిదం డ్రులలో మార్పు తీసుకురావాలని పిల్లల క్రమశిక్షణ విధానం అన్నింటిని తల్లులకు అవగాహన కల్పించారు. ప్రీస్కూల్ పిల్లలందరూ కూడా అంగన్వాడీ కేంద్రానికి చేర్పించాలని వారికి తగిన ప్రీస్కూల్ మెటీరియల్స్ అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తారని తెలిపారు. పిల్లల చేత అమ్మబొమ్మలు వేయించి, అందులో రంగులతో తీర్చిదిద్దడం చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హిజాద్ ప్యారీ, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం మదనపల్లి సూర్య డాన్స్ అకాడమీ చిన్నారులచే శాస్త్రీయ, జానపద, సినీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి, మాస్టర్ సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

కడప అర్బన్ : కడప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై వారాంతపు ఆట విడుపులో భాగంగా ఆదివారం మిస్పా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ వారు శాస్త్రీయ, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. గోదారి గట్టుమీద రామచిలకవే, గొబ్బియాలో గొబ్బియాలు, ఇస్మార్ట్ శంకర్, గళ్ళుగళ్ళు తదితర పాటలకు డాన్స్ చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.

గ్యాస్ లీకై విలువైన పరికరాలు దగ్ధం

ఖాజీపేట : మండల పరిధిలోని సర్వర్‌ఖాన్‌పేటలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్రామానికి చెందిన కమలాపురం గౌస్‌పీర్ నివాసంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఫ్రిజ్‌కు అంటుకున్నాయి. ఫ్రిజ్‌తోపాటు ఇంట్లో విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ స్టవ్‌ను ముట్టించే క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని కుటుంబ మహిళలు పేర్కొన్నారు. స్థానికులు ఈ విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు సకాలంలో సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

నిరుపేద పిల్లలకు ఉచిత వసతి గృహం

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుపేద కుటుంబాల పిల్లలకు చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో చైతన్య చిల్డ్రన్ హోమ్ (బాలుర వసతి గృహం)లో పిల్లలకు ఉచిత వసతి ఏర్పాటు చేసినట్లు చైతన్న మహిళా మండలి సభ్యులు తెలిపారు. 4వ తరగతి నుండి 7వ తరగతి వరకు చదువుతున్న.. తల్లిగానీ తండ్రిగానీ లేని బాలలు, నిరుపేద కుటుంబాల బాలురులకు వసతి గృహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో చేరే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతోపాటు ప్రతిరోజు అల్పాహారం కూడా ఉంటుందన్నారు. సాయంత్రం ఒక గంటపాటు స్పోర్ట్స్ అండ్ గేమ్స్, మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. స్నానాలకు వేడి నీటి సౌకర్యం, జిలకర మసూర బియ్యంతో రుచి కరమైన భోజనం పెడతామన్నారు. అర్హతగల ఉపాధ్యాయులతో ఉదయం, సాయంత్రం విద్యా బోధన చేయనున్నట్లు వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ, గ్రంథాలయ సౌకర్యం ఉంటుందన్నారు. చేతిరాత మెలకువలు నేర్పిస్తామన్నారు. పరిసరాలు 24 గంటలు సీసీ కెమెరా నిఘాలో ఉంటాయన్నారు. వినోదాన్ని కలిగించేందుకు టీవీ ఎల్సిడి ప్రొజెక్టర్ కలదని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆత్మ రక్షణ కోసం కరాటే శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వసతి గృహంలో చేరే విద్యార్థులు వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలో ఉన్న చైతన్య మహిళా మండలి కార్యాల యంలోని 88867 67141, 80745 08115 నంబర్లను సంప్రదిం చాలన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లి, కోళ్ల బైలు-2 పంచాయతీ, వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఎం.అశోక్ కుమార్(21), అతని స్నేహితుడు ప్రదీప్ తో కలిసి ఏప్రిల్ నెల 29న మండలంలోని నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద అశోక్ కుమార్‌కు తెలిసిన వారి పెళ్లికి బైక్‌పై వస్తూ వాహనం అదుపు చేయలేక క్రింద పడటంతో అశోక్‌కుమార్, ప్రదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. అనంతరం ప్రదీప్ తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో, అశోక్‌కుమార్ తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్సలు పొందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడని మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఉంచినట్లు మృతుని తండ్రి ఎం.రామచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.